శ్రీనివాస్‌నగర్‌లో హనుమాన్ విగ్రహావిష్కరణలో
ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ శ్రీనివాసరావు, దామోదర్‌రెడ్డి

27 అడుగుల హనుమాన్ విగ్రహావిష్కరణ

మియాపూర్, జనవరి 6: హైదర్‌నగర్ డివిజన్ శ్రీనివాస్‌నగర్‌లోని పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వర అభయాంజనేయ స్వామి దేవాలయంలో డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అవుకు దామోదర్‌రెడ్డి ఏర్పాటు చేసిన 27 అడుగుల హనుమాన్ విగ్రహాన్ని ఎంపీ రంజిత్‌రెడ్డి, కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు, రంగారావులతో కలిసి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజాదికాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

– నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని హైదర్‌నగర్ డివిజన్ హెచ్ఎంటీ హిల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలండర్‌ను కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావు, అధ్యక్షుడు మూర్తి సహా ఇతర ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే గాంధీ తన నివాసంలో విడుదల చేశారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పార్టీ నేతలు రఘునాథ్‌రెడ్డి, వాలా హరీశ్‌రావు సహా ఇతర నేతలు, పార్టీ శ్రేణులు, కాలనీసంఘాల ప్రతినిధులు ఎమ్మెల్యే గాంధీకి శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

కొండాపూర్, జనవరి 6 : చందానగర్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం నిర్వహించిన స్వామి కల్యాణం, పుష్పయాగం, అన్నప్రసాద వితరణలలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పాల్గొన్నారు. అనంతరం విచ్చేసిన భక్తులకు అన్నప్రసాదములను వడ్డించారు.

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను కలిసిన ప్రజలు

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను నియోజకవర్గ ప్రజలు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపడంతో పాటు వారి సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం తాను అందుబాటులో ఉంటానని, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించేలా తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. *– కుత్బుల్లాపూర్, జనవరి 6*

బెటాలియన్‌లో స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్

స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో పోటీపడుతున్న క్రీడాకారులు

కొండాపూర్, జనవరి 6 : కొండాపూర్‌లోని 8వ పోలీసు బెటాలియన్‌లోని 'బీ' కంపెనీ అన్యూవల్ రీప్రెషర్ కోర్సులో భాగంగా శనివారం స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బెటాలియన్ కమాండెంట్ సీ సన్నీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడల వలన మానసిక, శారీరక ప్రశాంతతలు చేకూరుతాయని, దేహధారుడ్యం పొందుతారన్నారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ అదనపు కమాండెంట్ బీ రామకృష్ణ, కంపెనీ సహాయక కమాండెంట్ డీ సత్యనారాయణ, కమాండర్ ఎన్‌వీ ఆది నారాయణరెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరిస్తున్నాం

తనను కలిసిన వారి సమస్యలను
తెలుసుకుంటున్న కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ

దుండిగల్,జనవరి6: ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తున్నామని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ నేత, దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, యువజన సంఘాలు, కాలనీ సంక్షేమసంఘాల ప్రతినిధులు శనివారం శంభీపూర్‌కృష్ణను ఆయన కార్యాలయం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ బస్తీలు, కాలనీలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఆయన సమస్యల పట్ల చిత్తశుద్ధితో పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ వైద్యశిబిరాలు వినియోగించుకోవాలి

వైద్యశిబిరంలో కార్పొరేటర్ జగన్, స్థానికులు

జగద్గిరిగుట్ట, జనవరి 6: పేదలకోసం ప్రభుత్వం అందించే వైద్యసేవలు వినియోగించుకోవాలని కార్పొటరేటర్ జగన్ కోరారు. జగద్గిరిగుట్ట మఖ్దూంనగర్‌లో శనివారం ఆయుష్మాన్ భారత్ వెల్నెస్ సెంటర్ నేతృత్వంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా బస్తీవాసులకు వైద్యులు, సిబ్బంది ఆరోగ్యపరీక్షలు నిర్వహించారు. రిపోర్టుల అనంతరం వైద్యసహాయం, మందులు అందజేస్తామని తెలిపారు. బస్తీవాసులు, డివిజన్ నేతలు పాల్గొన్నారు.

సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలి

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 6 : సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుని భవిష్యత్ తరాలకు అందించాలని జనసేన నేత ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్ అన్నాడు. శనివారం కేపీహెచ్‌బీ కాలనీ రమ్యాగ్రౌండ్‌లో జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలని ఆయన ప్రారంభించారు. అనంతరం ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ముంతాజ్, ఎర్ర సత్య, పుష్పలత, సరోజినీదేవి, దయాకర్, శంకర్, నాగరాజు, కిశోర్, అంజి, సత్యసాయి, సుబ్బు, షణ్ముఖ, శ్రీనివాస్, గోవింద్, కమలాకర్, వెంకట్, శివ తదితరులున్నారు.

కేపీహెచ్‌బీ కాలనీలో ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న ప్రేమ్‌కుమార్ తదితరులు

దళితబంధును రద్దు చేయొద్దు

- కూకట్‌పల్లి ప్రజలకు అండగా ఉంటా
- వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఆదరించాలి
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీలో ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 6 : బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు సంక్షేమ పథకాన్ని రద్దు చేయొద్దని వాటిని కొనసాగించి దళితులను ఆదుకోవాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం కేపీహెచ్‌బీ కాలనీ కార్పొరేటర్ మందడి శ్రీనివాస్‌రావు ఆఫీస్‌లో డివిజన్‌కు చెందిన వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూకట్‌పల్లి నియోజకవర్గంలో మూడో సారి ఆదరించి భారీ మెజార్టీతో హ్యాట్రిక్ విజయాన్ని అందించిన ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని.. కష్ట సుఖాల్లో అండగా ఉంటానన్నారు. కూకట్‌పల్లిలో పదేండ్ల కాలంగా జరిగిన అభివృద్ధి, పేదలకు అందిన సంక్షేమ పథకాలను ఆదరిస్తూ ప్రజలందరూ ఏకపక్షంగా తీర్పునివ్వడం సంతోషకరమన్నారు. ప్రభుత్వం మారినా కూకట్‌పల్లిలో అభివృద్ధిని కొనసాగించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ఆయా కాలనీలలో సమస్యలను పరిష్కరించి ప్రజలందరికీ అండగా ఉంటానని తెలిపారు. కూకట్‌పల్లిలో దీర్ఘకాలిక సమస్యలన్నీ పరిష్కారమయ్యాయని.. మిగిలిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. పార్టీలేమైనా అభివృద్ధే ఎజెండాగా ముందుకు సాగుతానన్నారు.

పార్లమెంట్ ఎన్నికలలో బీఆర్ఎస్‌ను ఆదరించాలి

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని ఆదరించి భారీ మెజార్టీని అందించాలని ఎమ్మెల్యే కృష్ణారావు కోరారు. మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో దళితుల అభ్యున్నతి కోసం దళితబంధు పథకాన్ని తీసుకొచ్చారని.. దీన్ని రద్దు చేయడం బాధాకరమన్నారు. పేదలకు సంక్షేమ ఫలాలు, నియోజకవర్గంలో అభివృద్ధి జరిగితే ప్రభుత్వానికి సహకరిస్తామని.. ప్రజా వ్యతిరేక విధానాలతో పాలన సాగితే పోరాడేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వాన్ని ఇప్పుడే విమర్శించడం తగదన్నారు. స్థానికంగా బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే.. కార్పొరేటర్లు ఉన్నారని ఎంపీ కూడా బీఆర్ఎస్ పార్టీనుంచే ఎన్నికైతే అభివృద్ధి సజావుగా సాగుతుందన్నారు. ఇదే స్ఫూర్తితో బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. తన గెలుపు కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు పేరుపేరున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మందడి శ్రీనివాస్‌రావు, డివిజన్ అధ్యక్షుడు ఎం.కృష్ణారెడ్డి, కార్యదర్శి రాజేశ్, కట్టా నరసింగరావు, శ్యామలరాజు, విజయ్‌కుమార్ చౌదరి, పలు కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు, బీఆర్ఎస్ పార్టీ నేతలున్నారు.

'విజ్ఞాన జ్యోతి'లో ప్రారంభమైన రోబోటిక్స్ ఈవెంట్

ప్రదర్శనను తిలకిస్తున్న పాఠశాల యాజమాన్యం

దుండిగల్,జనవరి 6: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, బాచుపల్లిలోని వీఆర్ఎస్ విజ్ఞాన జ్యోతి పాఠశాల ప్రాంగణంలో శనివారం 'సౌత్‌ఇండియన్ రోబోటిక్స్ ఈవేంట్' ప్రారంభమైంది. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాలను పాఠశాల ట్రస్ట్‌సభ్యులు వల్లూరిపల్లి రాజశేఖర్, డైరెక్టర్ కొడాలి విజయరాణి ప్రారంభించారు. దక్షిణ భారతదేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 500 మంది విద్యార్థులు ఈవెంట్‌లో పాల్గొని తమ నమూనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల మేనేజర్ చలసాని సాయాజీరావు తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా బబుల్స్ ప్లే స్కూల్ వార్షికోత్సవం

బబుల్స్ ప్లే స్కూల్ వార్షికోత్సవంలో ఆట పాటలో చిన్నారులు

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 6 : కేపీహెచ్‌బీ కాలనీ వసంతనగర్‌లోని బబుల్స్ ప్లే స్కూల్ 15వ వార్షికోత్సవం కోలాహలంగా జరిగాయి. ఈ వేడుకల్లో పాల్గొన్న పాఠశాల కరస్పాండెంట్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ.. పాఠశాల దశలోనే చిన్నారుల్లో అంతర్గతంగా దాగిఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడమే లక్ష్యంగా విద్యా బోధన సాగిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో సందడి చేశారు.

అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి

బాలానగర్, జనవరి 6 : ఫతేనగర్ డివిజన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయడంతోపాటు నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్ జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. శనివారం డివిజన్ పరిధిలోని పైప్‌లైన్ రోడ్డులో సీసీరోడ్డు నిర్మాణ పనులు, శోభనకాలనీలో దోభీఘాట్ నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో వీరేశంగుప్త, అశోక్, ఎట్టయ్య పాల్గొన్నారు.

అలరించిన వేణుగానం

మాదాపూర్, జనవరి 6: మాదాపూర్‌లోని అన్నమాచార్య భావనా వాహినిలో కళాకారుడు రామశర్మ వేణు గానం ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంది. పద్మశ్రీ, డాక్టర్ శోభరాజు ఆధ్వర్యంలో శ్రీ స్వర సిద్ధి వేంకటేశ్వర స్వామి వారికి నృత్య కైంకర్యం చేశారు. ఇందులో భాగంగా తొలుత అన్నమాచార్య భావనా వాహిని విద్యార్థులు శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్రమ్, శ్రీ లక్ష్మి అష్టోత్తర శతనామ స్తోత్రమ్, శ్రీ అన్నమాచార్య అష్టోత్తర శత నామావళి, గురుస్తుతితో ప్రారంభించారు. కళాకారులు వాతాపి గణపతిం భజే, ప్రభుం ప్రాణ నాదం, తిరుమల గిరిరాయ, వరణు శరణు, భావము లోన, బాహ్యము నందును, ఓం నమో భగవతే వాసుదేవాయ, కొండలలో నెలకొన్న, హరి వరాసనం, చూడరమ్మ సతులాల వంటి సంకీర్తనలకు వేణుగానం చేశారు. పద్మశ్రీ, డాక్టర్ శోభరాజు కళాకారుడు రామశర్మకు శాలువా కప్పి జ్ఞాపికతో సత్కరించారు.

శేరిలింగంపల్లి ఓటర్లు 7,41,212

ముసాయిదా ఓటరు జాబితా విడుదల

మియాపూర్, జనవరి6: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ముసాయిదా ఓటర్ల జాబితాను నియోజకవర్గ ఓటు నమోదు అధికారులు శనివారం విడుదల చేశారు. ఈ మేరకు నియోజకవర్గంలో 7,41,212 ఓటర్ల సంఖ్య తేలింది. ఇందులో పురుషులు 3,92,877, మహిళలు 3,48,187, ఇతరులు 148 మంది ఓటర్లున్నారు. నియోజకవర్గంలోని 622 పోలింగ్ కేంద్రాల్లో ముసాయిదా ఓటర్ల జాబితాను అందుబాటులో ఉంచారు. వీటిపై ఎటువంటి అభ్యంతరాలున్నా ఈనెల 22లోగా దరఖాస్తు చేయాలని నియోజకవర్గ ఓటు నమోదు అధికారి రజనీకాంత్‌రెడ్డి తెలిపారు.

ఎంఎల్ఆర్ఐటీ కళాశాలలో ముగిసిన హ్యాకథాన్

హ్యాకథాన్‌లో గెలుపొందిన విద్యార్థులతో
కళాశాల సెక్రెటరీ, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

దుండిగల్,జనవరి 6: దుండిగల్‌లోని మర్రి లక్ష్మన్‌రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఎల్ఆర్ఐటీ) కళాశాలలో గతరెండు రోజులుగా జరుగుతున్న 'ఎరో ట్రాన్ హ్యాకథాన్' శనివారం ముగిసింది. కళాశాలకు చెందిన ఎరోనాటికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ హ్యాకథాన్‌లో రాష్ట్రంలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. మొత్తం 50 గ్రూపులుగా ఏర్పడి విమాన తయారీ నమూనాలను ప్రదర్శించారు. ముగింపు కార్యక్రమానికి కళాశాల చైర్మన్ మర్రిలక్ష్మన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ హ్యాకథాన్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలను కళాశాల సెక్రెటరీ, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.కే.శ్రీనివాసరావు, డైరెక్టర్ మర్రి అనుశ్రేయారెడ్డి, డీన్ డా.వీ.రాధికాదేవి, ఎరోనాటికల్ విభాగం అధిపతి డా.సత్యనారాయణ గుప్త, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్లు సాయికుమార్, శ్రీకాంత్, ప్రవంతి తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికరంగం వైపు ఆలోచనలు చేయాలి

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న పలువురు వక్తలు

కుత్బుల్లాపూర్,జనవరి6: విద్యార్థులు పారిశ్రామిక రంగం వైపు ఆలోచన చేసి సమాజంలో ఉపాధి అవకాశాలను కల్పించే స్థాయికి ఎదగాలని దూలపల్లి సెయింట్ మార్టిన్ ఇంజినీరింగ్ కళాశాల వైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి అన్నారు. సెయింట్ మార్టిన్ ఇంజినీరింగ్ కళాశాల దూలపల్లిలో జరిగిన యువత భావి పారిశ్రామికవేత్తలు అనే అంశంపై ఒక్కరోజు అవగాహన సదస్సులో ఎంఎస్ఎంఈ, కేవీఐసీ, డీఐసీ, ఎస్‌బీఐలకు చెందిన పలువురు వక్తలు హాజరై తమ సందేశాన్ని విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.సంతోష్ కుమార్‌పాత్ర, వక్తలు ఆర్‌కె యాదవ్, సుధీర్ వర్మ, పి.శ్రీనివాస్‌రెడ్డి, కళాశాల డైరెక్టర్ జి.చంద్రశేఖర్‌యాదవ్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

మాదాపూర్‌లోని శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శన సందర్భంగా విశేషంగా ఆకట్టుకుంది. ఈ నేపథ్యంలో డాక్టర్ చంద్ర తపసహా రాయ్ శిష్య బృందం చేసిన కథక్ నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది.

– కొండాపూర్, జనవరి 6

కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌గా అభిలాష అభినవ్

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 6 : కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌గా అభిలాష అభినవ్ బాధ్యతలు స్వీకరించారు. కూకట్‌పల్లి జడ్సీగా పనిచేసిన వి.మమత నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్‌గా బదిలీ కావడంతో నూతన జోనల్ కమిషనర్‌గా అభిలాష అభినవ్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు శనివారం జడ్సీ మమత బదిలీపై వెళ్లిపోగా.. కొత్త జడ్సీగా అభిలాష అభినవ్ బాధ్యతలు స్వీకరించారు.

లిటిల్ ఫ్లోరెట్స్ స్కూల్ వార్షికోత్సవం

మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్‌లో శనివారం లిటిల్ ఫ్లోరెట్స్ స్కూల్ వార్షికోత్సవం సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్న పాఠశాల విద్యార్థులు *– మాదాపూర్, జనవరి 6*

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి

మియాపూర్, జనవరి 6 : కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన అందరికీ అందేలా కృషి చేస్తానని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం తగు కృషి చేస్తున్నదన్నారు. మియాపూర్ డివిజన్ మయూరీనగర్‌లో ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని ఆయన శనివారం పరిశీలించారు. అనంతరం మియాపూర్ డివిజన్ మయూరీ నగర్‌లో కాలనీవాసులతో కలిసి జగదీశ్వర్ గౌడ్ పర్యటించారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంఘం ప్రతినిధులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

అయోధ్య రాముడి అక్షింతలు ఇంటింటికి పంపిణీ

నిజాంపేట్ మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డికి శ్రీరామజన్మభూమి
పూజిత అక్షింతలను అందజేస్తున్న శ్రీరామ తీర్థక్షేత్ర సంచాలన సమితీ సంయోజకులు

దుండిగల్/కేపీహెచ్‌బీ కాలనీ/కుత్బుల్లాపూర్/అల్లాపూర్, జనవరి 6: అయోధ్యలోని శ్రీరామజన్మభూమి పూజిత అక్షింతలను నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని పలుకాలనీలు, బస్తీల్లో శనివారం ఆయాప్రాంతాలకు చెందిన శ్రీరామ తీర్థక్షేత్ర సంచాలన సమితీ సంయోజకులు ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అక్షింతలతో పాటు స్వామివారి చిత్రపటాలను అందజేశారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, బాచుపల్లి హిల్‌కౌంటీలోని మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డికి శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర పూజిత అక్షింతలను సంచాలన సమితీ సంయోజకులు అందజేశారు.

మల్లంపేట్‌లో..

దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, మల్లంపేట్‌లోని ప్రణీత్ ప్రణవ్‌లీఫ్ కాలనీకి చేరుకున్న అయోధ్యలోని శ్రీరామజన్మభూమి పూజిత అక్షింతలకు స్థానికులతో కలిసి కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ శనివారం ఘనస్వాగతం పలికడంతో పాటు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం కాలనీలోని ఇంటింటికి పల్లకీసేవతో శ్రీరామజన్మభూమి పూజిత అక్షింతలను పంపిణీ చేశారు. కాలనీ సంక్షేమసంఘం ప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీ కాలనీలో...

కేపీహెచ్‌బీ కాలనీలోని మలేషియన్ టౌన్‌షిప్ నార్త్‌బ్లాక్‌లో శ్రీవేంకటేశ్వర బస్తీ ఆధ్వర్యంలో ఇంటింటికి అయోధ్య రాముడి అక్షింతలను ఇంటింటికి పంపిణీ చేస్తున్న కట్టా నరసింగరావు, సత్తిరాజు, మహేశ్, రఘురామ్, పున్నారావు, వేణుగోపాల్, రాజావెంకట్రావ్, తిరుపతిరావు, నాగేశ్వర్‌రావు, కుటుంబశాస్త్రి, మంజు, దేవి, రత్నమాల, నారాయణమ్మ తదితరులు

– కూకట్‌పల్లిలో ఇంటింటికి అయోధ్య రాముడి అక్షింతల పంపిణీలో బీజేపీ సీనియర్ నాయకుడు బలరామ్‌రాజు, కన్వీనర్ శ్రీకర్‌రావు, రాజారావు, సుధాకర్‌చారి, కల్యాణ్, రవికుమార్, గుణవతి తదితరులు

కుత్బుల్లాపూర్‌లో..

అయోధ్య రామమందిరం నుంచి వచ్చిన అక్షింతలను శనివారం జీడిమెట్ల డివిజన్ ఎంఎన్‌రెడ్డినగర్‌లో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఇంటింటా తిరిగి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీసంక్షేమ సంఘం ప్రతినిధులు శ్యామ్, ఎల్లంగౌడ్, పండు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అల్లాపూర్‌లో..

అల్లాపూర్ డివిజన్ పరిధిలో ప్రతి ఇంటింటికి అక్షింతలు పంపిణీ చేశారు. శనివారం బబ్బుగూడ ప్రాంతంలో బస్తీవాసులు ఎల్లమ్మ పోచమ్మ కొలువుదీరిన ఆలయంలో అక్షింతల కలశానికి ప్రత్యేక పూజలు చేసి అక్షింతలు పంపిణీ మొదలు పెట్టారు. కార్యక్రమంలో బోడ శ్రీనివాస్ ఉన్నారు.

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తన పుట్టినరోజు సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి

ఘనంగా జన్మదినం

గోపన్‌పల్లిలో అభిమానులు, కార్యకర్తల మధ్య జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న శేరిలింగంపల్లి మాజీ ఎమ్మెల్యే మారబోయిన భిక్షపతియాదవ్, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి

– శేరిలింగంపల్లి, జనవరి 6

డాక్టరేట్ పట్టా పొందిన శ్రీను నాయక్‌కు సన్మానం

జేఎన్‌టీయూహెచ్ బంజారా విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో డాక్టరేట్ పట్టా పొందిన గిరిజన బిడ్డ సబావత్ శ్రీను నాయక్‌ను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వినోద్ నాయక్, పరమేశ్ నాయక్, ఆకాశ్, యాకూబ్, సంతోష్, శశి, సురేశ్, విష్ణు, తిరుమలేశ్, కావ్య, సోను, పద్మ, కల్యాణి తదితరులు

– కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 6

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో 2లక్షల28వేల193 దరఖాస్తుల దాఖలు

దుండిగల్,జనవరి 6: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టి ప్రజాపాలన(అభయహస్తం) దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ శనివారంతో ముగిసింది. నియోజకవర్గం పరిధిలోని కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో మొత్తంగా 83,746, గాజులరామారం సర్కిల్ పరిధిలో 92449, నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో23,545, దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో 20,053, కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో 8400 దరఖాస్తులు అందాయి. తొమ్మిది రోజుల్లో నియోజకవర్గం పరిధిలో మొత్తం 2లక్షల28వేల193 దరఖాస్తులు దాఖలయ్యాయి.

కొనసాగుతున్న కొవిడ్ పరీక్షలు

కొండాపూర్, జనవరి 6 : కొండాపూర్‌లోని రంగారెడ్డి జిల్లా దవాఖానలో కొవిడ్ పరీక్షలు కొనసాగుతున్నాయి. వైద్య పరీక్షల్లో భాగంగా శనివారం 964 జనరల్, 13 కొవిడ్, 3 ఆర్టీపీసీఆర్ టెస్ట్‌లను నిర్వహించినట్లు దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ అనురాగిణిరెడ్డి తెలిపారు. కొవిడ్ లక్షణాలున్న వారు వెంటనే వైద్య పరీక్షలను చేయించుకోవాలని, మాస్కులు ధరించి, సోషల్ డిస్టెన్స్‌ను పాటించాల్సిందిగా తెలిపారు.

నేడు బాలానగర్‌లో సంక్రాంతి ముగ్గుల పోటీలు

బాలానగర్, జనవరి 6 : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ప్రతి యేడాది మాదిరిగానే ఈ సంవత్సరం కూడా సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి తెలిపారు. బాలానగర్ కనకదుర్గ ఆలయం ఎదురుగా గల రోడ్డులో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య

బాలానగర్, జనవరి 6 : అప్పుల బాధతో జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన బాలానగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ కె. భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఫతేనగర్ పైప్‌లైన్ రోడ్డుకు చెందిన భగీరథ మధుసూదన్ (27)తో బాలానగర్ వినాయక్‌నగర్‌లో నివాసముండే మండల అశోక్‌కుమార్ కుమార్తె ప్రియాంకతో పెద్దల సమక్షంలో గతేడాది మే 11న వివాహం జరిపించారు. మధుసూదన్‌కు తల్లిదండ్రులెవర